Andhra Jyothy                                   Dt 27/11/17


ఆంధ్రజ్యోతి

GLOBAL ENTREPRENEURSHIP SUMMIT
INDIA 2017

సంరంభం

హైదరాబాద్ ● సోమవారం 27 నవంబరు 2017








# మెట్రో కోచ్‌లు సూపర్

**అత్యాధునిక సౌకర్యాలు.. ప్రతి కోచ్‌లో సీసీ కెమెరాలు**

**భద్రతకు అగ్నిమాపక పరికరాలు.. స్మోక్ డిటెక్టర్లు**

**రైలు మొత్తం ఏసీ చల్లదనం.. ఒక్కో కోచ్ ఖరీదు రూ.10 కోట్లు**

హైదరాబాద్ సిటీ, నవంబర్ 26 (ఆంధ్రజ్యోతి): భద్రతకు సీసీ కెమెరాలు, వినోదానికి ఎల్‌ఈడీలు, మొబైళ్లు, ల్యాప్‌టాప్‌లకు చార్జింగ్ పాయింట్లు, అత్యవసర పరిస్థితుల్లో రైలును ఆపేందుకు ఎమర్జెన్సీ అలారం, ఏసీల చల్లదనం.. ఇవీ హైదరాబాద్ మెట్రో కోచ్‌లో అత్యాధునిక సదుపాయాలు. తక్కువ సమయంలోనే గమ్యానికి చేర్చడంతోపాటు.. ఉన్న ఆ కొద్దిసేపూ ప్రయాణికులకు అద్భుతమైన అనుభూతి కల్పించేలా కోచ్‌లను తీర్చిదిద్దారు. దక్షిణ కొరియా నుంచి దిగుమతి చేసుకున్న సకల సదుపాయాలతో కూడిన ఒక్కో మెట్రో కోచ్ ఖరీదు అక్షరాలా రూ.10 కోట్లు. ప్రపంచ వ్యాప్తంగా మెట్రో రైళ్ల వ్యవస్థను పరిశీలించి, అన్నింటి కంటే మెరుగైన సదుపాయాలతో మన మెట్రో కోచ్‌లను సిద్ధం చేశారు. నగరంలోని 3 కారిడార్లలో 57 రైళ్లు నడిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఒక్కో రైలులో 3 కోచ్‌లు ఉంటాయి. మొత్తం 171 కోచ్‌లను దశలవారీగా నగరానికి తీసుకొచ్చారు.

### మెట్రో రైలులో ప్రయాణికుల సామర్థ్యం

| | డ్రైవర్ మోటర్ కోచ్ | ట్రైలర్ | డ్రైవర్ మోటర్ కోచ్ | మొత్తం |
|---|---|---|---|---|
| సీట్లు | 40 | 46 | 40 | 126 |
| నిలబడే సామర్థ్యం | 275 | 298 | 275 | 848 |
| మొత్తం | 315 | 344 | 315 | 974 |



ఎల్‌ఈడీ మ్యాప్ ఇండికేటర్స్

### భద్రతకు ప్రాధాన్యం..

అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేసిన మెట్రో కోచ్‌లో ప్రయాణికుల భద్రతకు పెద్దపీట వేశారు. అగ్ని ప్రమాదాలు జరిగినా తట్టుకునేలా కోచ్‌లను అల్యూమినియం, స్టెయిన్‌లెస్ స్టీల్‌తో తయారుచేశారు. నిల్చొని ప్రయాణించే వారికి వీలుగా రోప్ హ్యాండిల్స్ ఏర్పాటు చేశారు. ఏసీ కోచ్‌లు కావడంతో దుమ్ము, ధూళి లోపలికి రాదు. నిరంతరం పనిచేసేలా సీసీ కెమెరాల నిఘా, సెలూన్ డోర్ ఓపెనింగ్, క్లోజింగ్ అలారంతోపాటు ఎయిర్ బ్రేక్ సదుపాయం కల్పించారు. డ్రైవర్ క్యాబిన్‌లో ఫైర్ సేఫ్టీ పరికరాలున్నాయి. కిటికీలను డబుల్ గేజ్‌డ్ గ్లాస్‌తో తయారు చేశారు. వాటి మధ్యన పీవీబీ ఫిల్మ్ అమర్చారు. ప్రతి కోచ్‌లో ఎల్‌ఈడీ లైట్లు, హెడ్ లైట్లు, మార్కర్ లైట్లు ఏర్పాటు చేశారు. ఎల్‌ఈడీ రేట్ మ్యాప్ ఇండికేటర్స్ అందుబాటులో ఉంచారు.

**1 రైలు.. 3 కోచ్‌లు**

ఒక్కో మెట్రో రైలులో మూడు కోచ్‌లు ఉంటాయి. అవసరమైతే అదనంగా మరో మూడు కోచ్‌లు జతచేసే సౌలభ్యం ఉంది. రైలులో దాదాపు 1000 మంది ప్రయాణించవచ్చు. ప్రస్తుతం ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు రైళ్లను నడపనున్నారు. రైలులో మొదటి కోచ్‌ను, చివరి కోచ్‌ను డ్రైవర్ మోటార్ కోచ్‌లుగా, మధ్యలోని కోచ్‌ను ట్రైలర్ కోచ్‌గా పిలుస్తారు.



ఎమర్జెన్సీ అలారం

### కోచ్‌లో ఆధునిక సదుపాయాలు..

ప్రతి కోచ్‌లో ఆటోమేటిక్ ట్రైన్ ప్రొటెక్షన్, ఆటోమేటిక్ ట్రైన్ ఆపరేషన్స్, ఆటోమేటిక్ ట్రైన్ సూపర్‌విజన్, పాసింజర్ ఎమర్జెన్సీ అలారం, పాసింజర్ అడ్రస్ సిస్టం, సీసీ కెమెరాలు, ఎయిర్‌బ్రేక్ సిస్టం, స్మోక్ అండ్ ఫైర్ డిటెక్టర్స్ ఆటోమేటిక్ డోర్ సిస్టం సదుపాయాలున్నాయి.